క్లుప్తంగా

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం


రోడ్డు పనులు ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ

కార్వేటినగరం: గ్రామాల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ అన్నారు. సోమవారం మండలంలోని కనికాపురం గ్రామానికి రోడ్డు నిర్మాణ పనులను పార్టీ మండల కన్వీనర్ ధనంజయవర్మ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శీలారాణి, ఎంపీటీసీ సభ్యురాలు విమల, ఎంపీటీసీ మాజీ సభ్యుడు జేమ్స్, శేషాద్రి, వెంకటేశులునాయుడు, మునిరామనాయుడు, సంజీవనాయుడు, సాయి, నరసింహనాయుడు, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు కోసం నిరసన


నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

నగరి: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వం రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ రాష్ట్ర సమితి ఇచ్చినటువంటి పిలుపు మేరకు స్థానిక సీపీఐ నాయకులు సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యులు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య మాట్లాడుతూ గొప్ప చరిత్ర కలిగిన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని నేడు నరేంద్ర మోదీ ప్రభుత్వం పోస్కో కంపెనీకి అమ్మాలని చూస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వేలన్ బాషా, మురళి, ఏఐటీయూసీ నాయకులు బుజ్జి, మనోహర్, సత్తార్ ప్రభాకర్, దశరథుడు, నవమి ఉష, సెల్వి తదితరులు పాల్గొన్నారు.

కొండ మల్లీశ్వరునికి ప్రత్యేక పూజలు



వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్ కండ్రిగ సమీపంలో అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. వేకువ స్వామివారికి నిత్యకైంకర్యాలు నిర్వహించి, ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం కొండమల్లీశునికి పాలాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో స్వామివారికి విశేషాలంకరణ చేసి, భక్తులకు దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

రీసర్వే వేగవంతం చేయాలి


భూ రీసర్వేని పరిశీలిస్తున్న తహసీల్దార్ సబ్బీర్‌బాషా

శ్రీరంగరాజుపురం: మండలంలో జరుగుతున్న భూ రీసర్వే వేగవంతం చేయాలని తహసీల్దార్ సబ్బీర్ బాషా అన్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలను సమగ్రంగా శాశ్వతంగా పరిష్కరించడానికి భూ రీసర్వే ఎంతగానో దోహదపడుతుందన్నారు. భూ రీసర్వేపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. మండలంలో ప్రభుత్వం భూమి వివరాలు గుర్తించడానికి ఈ సర్వే ఉపయోగపడుతుందన్నారు. అనంతరం పుల్లూరు సచివాలయం పరిధిలోని గ్రామాల్లో జరుగుతున్న భూ సర్వేని పరిశీలించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ మురళి, ఆర్ఐ త్యాగరాజు, వీఆర్వో వెంకటముని తదితరులు పాల్గొన్నారు

అంకితభావంతో పనిచేయాలి


నియామక పత్రం అందజేస్తున్న సర్పంచ్ గోవిందయ్య

వెదురుకుప్పం: వలంటీర్లు అంకితభావంతో పనిచేయాలని బొమ్మయ్యపల్లె సర్పంచ్ గోవిందయ్య అన్నారు. సోమవారం బొమ్మయ్యపల్లె సచివాలయంలో వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు వలంటీర్ల వ్యవస్థకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. తమకు కేటాయించిన ఇళ్ల పరిధిలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని చెప్పారు. అనంతరం విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన వలంటీర్ స్థానంలో కొత్తగా రేవతిని నియమించినట్లు తెలిపారు.

అండగా ఉంటాం.. ఆదరించండి

- గడప గడపకు మన ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి
- ఇంటింటికీ పథకాల బుక్‌లెట్ల పంపిణీ


సంక్షేమ పథకాలపై ఆరా తీస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

పాలసముద్రం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేదలకు అన్ని వేళలా అండగా ఉంటున్నారు.. ఆయన్ను మరోసారి ఆదరించాలని, అప్పుడే పేదల అభ్యున్నతి సాధ్యమని ఉపముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. వెంగళరాజుకుప్పం సచివాలయం పరిధిలోని గ్రామాల్లో పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ ఎస్ శివప్రకాష్‌రాజు, వైఎస్ ఎంపీపీ శేఖర్, పుష్ప, సర్పంచ్ లిల్లీ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డిప్యూటీ సీఎం నారాయణ స్వామి ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అమలు చేస్తున్న పథకాలను వివరిస్తూ బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ పథకాలు మంజూరు కావాలంటే మండల కార్యాలయాలు, నేతల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదని ఆరోపించారు. అయితే ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల ద్వారా పథకాలు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే నగదు రూపంలో జమ అవుతున్నాయన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి, పారదర్శకంగా, సమర్థవంతంగా అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ విషయం విస్మరించిన టీడీపీ అధినేత చంద్రబాబు సంక్షేమ పథకాలతో రాష్ట్రం దివాలా తీస్తున్నట్లు ఆరోపణలు చేస్తూ పేదల వ్యతిరేకిగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అయితే రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనిస్తున్నట్లు రిజర్వ్ బ్యాంక్ ఇటీవల ప్రకటించడం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనాదక్షతకు నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా మహిళలు డిప్యూటీ సీఎంకు మంగళహారతులు పట్టి, స్వాగతం పలికారు. వెంగళరాజుకుప్పం దళితవాడకు శ్మశానికి రోడ్డు, సీసీ రోడు, డ్రైనేజీ, గుట్టిమీదఇండ్లకు తాగునీటి ట్యాంకు, రోడ్డు వేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాబు, ఎంపీడీఓ విద్యావతి, ఎస్ఐ సురేష్, ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్, ఎంఈఓ రాజేంద్రప్రసాద్, సర్పంచ్ భాస్కర్ రెడ్డి, నరసింహరాజు, మహేష్, శోభ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తులసీయాదవ్, మాజీ ఎంపీపీ ఇందిరమ్మ, నాయకులు సుబ్రమణ్యం రెడ్డి, కేశవరెడ్డి, త్యాగరాజ్, సుమన్, ఆనందన్, కుట్టి, ప్రకాష్, మనోహర్ పాల్గొన్నారు.

జగనన్నకు అండగా ఉంటాం



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి మా కుటుంబానికి వైఎస్సార్ చేయూత రూ.37,500, వైఎస్సార్ ఆసరా రూ.28,370, వైఎస్సార్ సున్నా వడ్డీ రూ.5.671, వైఎస్సార్ పింఛన్ రూ.82 వేలు, మొత్తం రూ.2.50 లక్షలు లబ్ధి చేకూరింది. పేదలకు జగనన్న మంచి చేస్తున్నారు.. జగనన్న పాలన బాగుంది. వచ్చే ఎన్నికల్లో కూడా మా మంచి గురించి ఆలోచించే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉంటాం.

–నాగమ్మ, వెంగళరాజుకుప్పం దళితవాడ, గృహిణి

రుణపడి ఉంటాం



దేశంలో ఎన్నడు లేనివిధంగా విద్యకు మొదటి ప్రదాన్యత ఇచ్చి.. అమ్మఒడి, వసతి దీవెన, నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతులు, జగనన్న గోరు ముద్దలో రోజుకొక మెనూ మధ్యాహ్న భోజనం పెడుతున్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా యూనిఫామ్, బూట్లు, టై, బెల్టు, ఉచిత పాఠ్య, నోటు పుస్తకాలు ఇస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఆయనకు రుణపడి ఉంటాం.

–శశికళ, విద్యార్థి తల్లి, వీఆర్ కుప్పం

గడప గడపకూ వచ్చినవారే లేరు



గతంలో ఎన్నికలు వచ్చినప్పుడు ఓట్లు కోసం ఎమ్మెల్యేలు వచ్చేవారు. ఆ తరువాత ఐదేళ్లు కనిపించేవారు కాదు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అలా కాకుండా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించి మంత్రులు, ఎమ్మెల్యేలను, ఇంటింటికీ పంపి, ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తున్నారు. ఈ ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదే. మళ్లీ జగనన్నే సీఎంగా ఉండాలి.

–రాజేశ్వరి, వీఆర్ కుప్పం, గృహిణి

ఉచిత పశు వైద్య శిబిరం



వడమాలపేట : వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో కదిరిమంగళం గ్రామంలో సోమవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. అసోసియేట్ డీన్ డాక్టర్ ఆదిలక్ష్మి మాట్లాడుతూ పశువుల్లో గర్భకోశ వ్యాధులు, పిడుదుల నివారణకు మందులు పిచికారీ చేయాలని కోరారు. లేగ దూడల్లో నట్టల నివారణకు మందులు తాగించాలని సూచించారు. 150 పశువులకు చికిత్సలు నిర్వహించారు. రైతులకు మినరల్ మిక్చర్ పొట్లాలు అందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు వరప్రసాద్‌రెడ్డి, నవీన్, అనూష, పశువైద్యాధికారి మురళీధర్‌రెడ్డి, వీఎల్‌వో లోకనాథం, పశువైద్య కళాశాల ఆచార్యులు నాగేంద్రరెడ్డి, వాణి, అమరావతి, సాయి పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి వితరణ

కార్వేటినగరం: మండలంలోని డేరాకండ్రిగ గ్రామానికి చెందిన బాలాజీ తన తల్లిదండ్రులు గురవయ్యనాయుడు, నరసమ్మ జ్ఞాపకార్థం సోమవారం డీఎం పురం ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు 40 మందికి పరీక్ష సామగ్రిని వితరణ చేశారు. దాతలు ఈ సందర్భంగా పెన్నులు, రబ్బర్‌లు, పెన్సిళ్లు, ప్యాడ్‌లు, జామెంట్రీ బాక్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం నమ్మశ్శివాయ, వైఎస్సార్ సీపీ నాయకుడు యుగంధర్‌నాయుడు పాల్గొన్నారు.

పట్టభద్రుల సంక్షేమమే లక్ష్యం


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, వేదికపై బియ్యపు పవిత్రారెడ్డి

శ్రీకాళహస్తి : పట్టభద్రుల సంక్షేమమే లక్ష్యంగా కృషి చేస్తామని ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆడిటోరియంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె బియ్యపు పవిత్రారెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యాసంస్థల అధినేతలు, పట్టభద్రులతో సమావేశం నిర్వహించారు. పవిత్రారెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ బలపరచిన శ్యామ్‌ప్రసాద్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎంపీ గురుమూర్తి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, పట్టభద్రుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యాల ఇబ్బందులను తొలగించేందుకు చర్యలు చేపడుతామని వివరించారు. శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎమ్మెల్సీ అభ్యర్థిగా తన పేరును ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సూచించారని వెల్లడించారు.

చిరుధాన్యాల సాగుతో అధిక లాభాలు

పిచ్చాటూరు: చిరుధాన్యాల సాగుతో అధిక లాభాలు పొందవచ్చని డీడీఏ ధనుంజయరెడ్డి తెలిపారు. అంతర్జాతీయ చిరుధాన్యాల దినోత్సవాన్ని పురస్కరించుకొని సిద్ధిరాజుకండ్రిగలో సోమవారం రైతులకు చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సజ్జ సాగు చేసిన రైతులకు హెక్టార్‌కు విత్తన శుద్ధి మందులతో పాటు ఇతర పురుగు మందులను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందన్నారు. సివిల్ సప్లయి ద్వారా 100 శాతం బైప్యాక్ ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఏడాదిని ప్రధాని చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించడం వల్ల గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. ఒక ఎకరం వరి పండించే నీటితో నాలుగు ఎకరాలు చిరుధాన్యాలను పండించవచ్చన్నారు. సత్యవేడు ఏడీ రమేష్ రెడ్డి మాట్లాడుతూ మే, జూన్ నెలల్లో చిరుధాన్యాలు చల్లుకుంటే పంటను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. చిరుధాన్యాలు తినడం వల్ల బ్లడ్ షుగర్ తగ్గుతుందని, ఫైబర్ ఎక్కువగా ఉండడం వల్ల గ్యాస్టిక్ సమస్య రాదని, కొన్ని రకాల క్యాన్సర్‌ను నివారించవచ్చని వివరించారు. ఏఓలు సంజీవ రెడ్డి, శ్రీను, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

టీబీ రహిత సమాజానికి కృషి చేయండి


అవగాహన కల్పిస్తున్న ఆరోగ్యవిద్యాధికారి రాజేంద్రప్రసాద్

గంగాధరనెల్లూరు: టీబీ రహిత సమాజానికి కృషి చేయాలని ఆరోగ్యవిద్యాధికారి రాజేంద్రప్రసాద్ కోరారు. మండలంలోని నరసాపురం, ఒగ్గువారి పల్లెల్లో సోమవారం టీబీ ముక్తాభారత్ – 2025లో భాగంగా ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అందులో ఆయన మాట్లాడుతూ టీబీ వ్యాధి బ్యాక్టీరియా ద్వారా సంక్రమిస్తుందని చెప్పారు. టీబీ వ్యాధి ఉన్నవారు తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు ఆ గాలిని పీల్చిన వారికి టీబీ సోకే ప్రమాదం ఉందని హెచ్చరించారు. టీబీ వ్యాధిని 2025 సంవత్సరం లోపు పూర్తిగా నిర్మూలించాలని ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. టీబీ సోకిన వారికి దగ్గు, రాత్రి వేళల్లో చలిజ్వరం, చాతీ నొప్పి, బరువు తగ్గడం, ఆకలి మందగించడం లాంటి లక్షణాలు ఉంటాయన్నారు. ఈ వ్యాధిని ఆర్టీపీసీఆర్ పరీక్ష ద్వారా నిర్ధారించేందుకు వీలుంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ అనూష, హెల్త్ కార్యదర్శి ప్రభావతితోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు సహకారం


సమావేశంలో మాట్లాడుతున్న రవిమణి

ఏర్పేడు : గ్రామీణ విద్యార్థులకు చదువులో సహకారం అందించి ఉన్నతంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఐఎల్‌పీ ప్రతినిధి రవిమణి తెలిపారు. సోమవారం మండలంలోని పెద్దఅంజిమేడు ప్రాథమికోన్నత, మేర్లపాక పాఠశాలల్లో ప్రజాప్రగతి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలకు సక్రమంగా రాని వారిని గుర్తించి వారిని బడిలో చేర్పించనున్నట్లు వివరించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రజాప్రగతి ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాసులు, కో–ఆర్డినేటర్లు చంద్రశేఖర్, సుస్మిత, ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్, సంజీవయ్య పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో విశ్రాంత డీజీపీ

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని సోమవారం తెలంగాణ విశ్రాంత డీజీపీ ఎంవీ భాస్కరరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లుచేశారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సతీష్‌మాలిక్, శ్రీనాథ్, వెంకటస్వామి పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం


చెంచువారి కాలనీలో వేస్తున్న కొత్త బోరు

వడమాలపేట: ఎన్నో ఏళ్లుగా నీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్న చెంచువారి కాలనీలో మంత్రి రోజా చొరవతో తాగునీటి బోరు వేశారు. ఎస్‌బీఆర్ పురం పంచాయతీ పరిధిలోని చెంచువారి కాలనీ వాసులు తాగునీటికి ఇబ్బంది పడుతున్నట్లు గతంలో మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఆమె స్పందించి ముఖ్యమంత్రి అభివృద్ధి నిధులతో ఆదివారం కొత్తబోరు వేశారు. దంతో దళిత గిరిజనుల సంఘం జిల్లా కార్యదర్శి నందయ్య మాట్లాడుతూ గిరిజనుల సమస్యను పరిష్కరించిన మంత్రి రోజాకు గిరిజనుల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎంపీటీసీ సభ్యురాలు కనకమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు బాబు, మాధవరాజు, అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు పుష్పరాజ్, జయ, నాగమ్మ, శాంతి, అరుణ, గీత, శారద తదితరులు పాల్గొన్నారు.

11 నుంచి కపిలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

తిరుపతి కల్చరల్: కపిలేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 11 నుంచి 20వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఫిబ్రవరి 10న అంకురార్పణ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఉత్సవాల్లో ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, తిరిగి రాత్రి 8 నుంచి 10 గంటల వరకు స్వామివారి వాహన సేవలు నిర్వహిస్తారు. 11వ తేదీ ఉదయం ధ్వజారోహణం, సాయంత్రం హంస వాహన సేవ, 12న సూర్యప్రభ, చంద్రప్రభ, 13న భూత వాహనం, సింహ వాహనం, 14న మకర వాహనం, శేష వాహనం, 15న తిరుచ్చి ఉత్సవం, అధికార నంది, 16న వ్యాఘ్ర,గజవాహనాలు, 17న కల్పవృక్ష, అశ్వ వాహనాలు, 18న రథోత్సవం, 19న పురుషామృగవాహనం, కల్యాణోత్సవం, తిరుచ్చి ఉత్సవం, 20న త్రిశూల స్నానం, ధ్వజావరోహణం, రావణాసుర వాహన సేవతో ఉత్సవాలు ముగుస్తాయి.

శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలు


నియామకపత్రాలను అందుకున్న అభ్యర్థులతో కార్పొరేటర్ సయ్యద్

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని రాంనగర్ కాలనీలో ఉన్న డీడీయూ జీకేవై శిక్షణ కేంద్రంలో అభ్యర్థులకు శిక్షణతోపాటు ఉద్యోగ అవకాశాలు కల్పించారని కార్పొరేటర్ సయ్యద్ అన్నారు. ఆ శిక్షణ కేంద్రంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ శిక్షణ కేంద్రంలో 105 మంది అభ్యర్థులకు శిక్షణ ఇచ్చి, వారందరికీ హైదరాబాద్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పించారని తెలిపారు. ప్రభుత్వాలు కల్పిస్తున్న ఈ అవకాశాన్ని యువత వినియోగించుకోవాలన్నారు. ప్లేస్‌మెంట్ ఆఫీసర్ చిరంజీవి మాట్లాడుతూ ఏపీలోని యువకులు శిక్షణను వినియోగించుకోవచ్చని తెలిపారు. ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు నియామకపత్రాలను అందజేశారు.

నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సెట్విన్ మేనేజర్ మోహన్‌కుమార్

వెదురుకుప్పం: విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సెట్విన్ మేనేజర్ మోహన్‌కుమార్ అన్నారు. మండలంలోని చవటగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం–ఉపాధి అవకాశాలు అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలోనూ నైపుణ్యాలు దాగి ఉంటాయని, వాటిని అభివృద్ధి చేసుకుంటే ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటాయని సూచించారు. ప్రతి విద్యార్థీ లక్ష్యంతో కూడి ఆలోచనతో ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. ఇప్పుడు ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ యువతకు అనేక అవకాశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. భవిష్యత్‌లో ఏదో సాధించాలనే కసి ఉంటే అవకాశాలు తానంతట అవే వెతుక్కుంటూ వస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అన్నపూర్ణ శారద(డిగ్రీ కళాశాల), నిర్మల కుమారి(జూనియర్ కళాశాల), రీసోర్స్‌పర్సన్ ఎస్ ఎస్ రెడ్డి, అధ్యాపకులు సభాపతిరెడ్డి, ఢిల్లీప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

శ్మశానవాటిక పనులు వేగవంతం


సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

చిత్తూరు కలెక్టరేట్: ఎస్సీ, ఎస్టీ గ్రామాల్లో చేపడుతున్న శ్మశానవాటిక పనులను వేగవంతం చేయాలని డిప్యూటీ సీఎం నారాయణస్వామి, కలెక్టర్ హరి నారాయణన్ అన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సోమవారం గంగాధరనెల్లూరు నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీసుకున్న ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో శ్మశాన వాటికల ఏర్పాటు నిర్ణయం చరిత్రాత్మకమైనదన్నారు. ఈ ఏర్పాట్లపై అధికారులు మనసుపెట్టి పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి పథకాలను పూర్తి పారదర్శకతతో అమలు చేస్తోందని చెప్పారు. జీడీ నెల్లూరు నియోజకవర్గ పరిధిలో పీఆర్, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్, జెడ్పీ నిధులతో జరుగుతున్న పనులు, ఇతర శాఖల ద్వారా జరుగుతున్న అన్ని పనుల్లో పురోగతి సాధించాలని చెప్పారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ గ్రామాల్లో శ్మశాన వాటికలకు కేటాయించిన స్థలాలకు హద్దులు నిర్ణయించి బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. జియో ట్యాగింగ్ చేసి ఫొటోలు తీయాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు డీకేటీ పట్టాల మంజూరుకు భూముల అసైన్‌మెంట్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఈ సమీక్షలో జేసీ వెంకటేశ్వర్, డీఎఫ్ఓ చైతన్యకుమార్ రెడ్డి, జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ చంద్ర శేఖర్ రెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ విజయ్ కుమార్ రెడ్డి, చిత్తూరు ఆర్డీవో రేణుకా, డీఎంహెచ్‌వో ప్రకాశం నియోజకవర్గ తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

వేగంగా 'స్పందన' వినతుల పరిష్కారం


తేనెబండలోని హౌసింగ్ లబ్ధిదారులతో మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: 'స్పందన'లో అందే వినతులను వేగంగా పరిష్కరించాలని నగర కమిషనర్ అరుణ నగరపాలక అధికారులను ఆదేశించారు. నగరపాలక కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి నగర ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఇదివరకు అందిన స్పందన వినతుల పరిష్కారంపై సంబంధిత విభాగాల అధికారులతో ఆమె సమీక్షించారు. స్పందన కార్యక్రమంలో అందే వినతులను ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలని, పరిష్కరించిన తర్వాత సరైన రికార్డులతో పరిష్కరించినట్లు నివేదిక ఇవ్వాలన్నారు. నాగాలమ్మ ఆలయం వెనుక భాగంలో మురుగునీటి కాలువలు నిర్మించాలని 44వ వార్డు ప్రజలు వినతి పత్రం సమర్పించారు. స్పందన కార్యక్రమంలో మొత్తం 8 వినతులు అందాయి. ఇంజినీరింగ్ –5, రెవెన్యూ, ప్రధాన కార్యాలయం, అకౌంట్స్ ఒక్కొక్కటి చొప్పున వినతులు అందాయి. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంహెచ్‌వో డా.లోకేష్, ఎంఈ ధనలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు సహాయ సహకారాలు

జగనన్న హౌసింగ్ కాలనీలో ఇళ్ల నిర్మాణాల కోసం లబ్ధిదారులకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని నగర కమిషనర్ అరుణ వార్డు కార్యదర్శులు, హౌసింగ్ అధికారులకు ఆదేశించారు. కమిషనర్ తేనెబండ హౌసింగ్ లేఔట్‌ను పరిశీలించారు. స్థానికంగా ఇల్లు నిర్మిస్తున్న లబ్ధిదారులతో మాట్లాడారు. లబ్ధిదారులు వేగంగా ఇల్లు నిర్మించుకోవడానికి అవసరమైన ఇసుక, ఇటుకలు వేగంగా సరఫరా చేయించడానికి నోడల్ అధికారులు, కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైతే ఇటుక బట్టీల యజమానులతో మాట్లాడి ఇటుకలు సరఫరా చేయించాలన్నారు. ఏ లేవుట్లో ఎంతమందికి ఇటుకల అవసరం ఉందో గుర్తించి అందుకు తగినట్లు సరఫరా చేసేలా చూడాలని తెలిపారు. ఇళ్ల నిర్మాణం నిరంతరాయంగా సాగేందుకు వీలుగా అవసరమైన మేస్త్రీలను సమన్వయం చేసుకోవాలని సూచించారు. అవసరమైతే ఇటుక బట్టీల యజమానులతో మాట్లాడి ఇటుకల సరఫరా చేయించాలని చెప్పారు. వివిధ దశల్లో ఉన్న నిర్మాణాలన్నీ మార్చి 15 నాటికల్లా పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో నోడల్ అధికారులు ఉదయం నుంచే వారికి కేటాయించిన లేఔట్లకు వెళ్లి ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్న తీరును పరిశీలించారు. నిర్మాణాలు వేగంగా పూర్తి చేయించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై వార్డు కార్యదర్శులు, హౌసింగ్ అధికారులకు మార్గ నిర్దేశం చేశారు.

స్పందనకు అర్జీల వెల్లువ

పూతలపట్టు: స్పందన కార్యక్రమంలో అర్జీలు వెల్లువెత్తాయని తహసీల్దార్ విజయభాస్కర్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. పాసుపుస్తకంలో పేరు మార్పులు, భూ సమస్యలు, ఆధార్, రేషన్‌కార్డుల్లో పేర్ల మార్పులు వంటి సమస్యలపై రైతులు అర్జీలు ఇచ్చినట్లు వివరించారు.